# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మంగళవారం 22 జూలై 2025

## స్వగ్రామం ప్రజాదర్బార్ కార్యక్రమంలో

**చిన్నమండెం జూలై 21 ప్రభాతవార్త:**
మండలంలోని పడమటికోన గ్రామం బోడిరెడ్డిగారిపల్లిలో సోమవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొంతమంది అధికారులు, నేతలు మరియు ప్రజలు మంత్రికి దుశాలవలు పుష్పగుచ్ఛంతో సత్కరించి సన్మానించారు.





ఆషాడమాసం ఉత్సవం లోభాగంగా: ఈరోజు అలంకరణ ఓం శ్రీ కనక దుర్గాదేవి నమః శ్రీ కనకదుర్గాదేవి ఆలయం బద్వేల్

# సంక్షేమం, అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఫారూక్**

**మదనపల్లె, జులై 21 ప్రభాతవార్త :**
సంక్షేమం,అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖామంత్రి మంత్రి ఎన్ఎండి ఫారూక్ తెలిపారు. సోమవారం రూరల్ మండలంలోని కోళ్ళబైలు గ్రామ పంచాయితీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా మంత్రి పాల్గొన్నారు. మంత్రి, ఎమ్మెల్యే ఇరువురు కలసి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్దిపై కరపత్రాల ద్వారా ఇంటింటా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వృద్దులకు, వికలాంగులకు పెన్షన్లు పెంచడం, నిరుపేదలకు ఉచితంగా దీపం కనెక్షన్లు, నిరుపేదల విద్యాభ్యాసం కోసం తల్లికి వందనం లాంటి పథకాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. వచ్చే నెల నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసి బస్సు సౌకర్యం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. చేనేత మగ్గాలకు 200యూనిట్లు, పవర్‌లూమ్స్ 500 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడం జరుగుతుందన్నారు. చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తొందన్నారు. అనంతరం పట్టణ లారీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు సమస్యలపై మంత్రికి విన్నవించారు. వెంటనే ఎమ్మెల్యే, మంత్రి ట్రాన్‌పోర్ట్ కమీషనర్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటామన్నారు. వాహనాల ఎఫ్‌సి సర్టిఫికెట్స్‌కు సంబంధించి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, రాటకొండ శ్రీనివాసులునాయుడు, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు నందకుమార్, నవీన్‌చౌదరి, డ్యాన్స్ రెడ్డప్ప, మల్లికార్జుననాయుడు, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, షంషీర్, రైస్‌మిల్ శశి, జేసిబి మదు, వేణు పాల్గొన్నారు.



ఇంటింటా కార్యక్రమంలో మంత్రి, ఎమ్మెల్యే

## అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వర్షాలు

**రాజంపేటలో భారీ వర్షం... పొంగి ప్రవహించిన డ్రైనేజీ కాలువలు**



**రాజంపేట, జూలై 21 ప్రభాతవార్త**
అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి వర్షాలు పడ్డాయి. రామసముద్రం ములకలచెరువు మినహా 28 మండలాల్లో వర్షపాతం నమోదయింది. ఎక్కువగా కలకడ 67.4 రాజంపేట 65.2 ,గాలివీడు 18.2 , చిన్నమండెం 38,సంబేపల్లి 42.4, సుండుపల్లె 32.4 ,రాయచోటి 32.4, లక్కిరెడ్డిపల్లె 15.2 ,రామాపురం 25.2, వీరబల్లె 21, నందలూరు 21.8, పెనగలూరు 25.4 ,చిట్వేలి 63.8, పుల్లంపేట 37.6, ఓబులవారిపల్లె 14 ,కోడూరు 13.4, తంబళ్లపల్లె 7.4, పెద్దమండెం 19.8, గుర్రంకొండ 22.6 ,కమ్మవారిపల్లె 30.2, పీలేరు 40.2 ,కలికిరి 29.2, వాయల్పాడు 18.6, కురబలకోట 47, బి కొత్తకోట 2.8, మదనపల్లె 13.4, నిమ్మనపల్లి 24.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. రాజంపేట పట్టణంలో...రాజంపేట పట్టణంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 9 గంటల నుంచి 10 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. దీంతో డ్రైనేజీ కాలువలు పొంగి ప్రవహించాయి. ప్రధాని రహదారిలోని పోలీస్ స్టేషన్,కోర్టు ఆర్టిసి బస్టాండ్, ఆఫీయల్ క్లబ్ ,మార్కెట్, ఆర్ అండ్ బి అతిథిగృహం, ముందర గడ్డ, చౌడేశ్వరి ఆలయం వద్ద భారీగా వరద నీరు ప్రవహించింది. డ్రైనేజీ కాలువలు పొంగి ప్రవహించడంతో కంపు కంపుగా మారింది. 65.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ప్రధానంగా ప్రధాన రహదారులు కోర్టు ముఖద్వారం వద్ద డ్రైనేజీ కాలువ పొంగి ప్రవహించడంతో దుర్గంధంగామారింది. దీంతో కోర్టు, సబ్ ట్రజరీ కార్యాలయం, తాసిల్దార్ కార్యాలయం, సివిల్ సప్లై గోడౌన్ ,సబ్ జైలు వద్దకు వెళ్లే వారు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## ఫిర్యాదుదారులకు త్వరితగతిన పరిష్కారం చూపండి

**ఇన్చార్జి కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్**



**కడప కలెక్టరేట్, జులై 21, ప్రభాతవార్త**
పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారం చూపాలని ఇన్చార్జి కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇన్చార్జి కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ మాట్లాడుతూ ఫిర్యాదులకు అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచిస్తూ.. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

## బాలపల్లి అడవుల్లో 9మంది ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

**రాజంపేట జూలై 21 ప్రభాతవార్త**
రాజంపేట ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని బాలపల్లె అటవీ ప్రాంతంలో ఎర్రచందనం స్పెషల్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది దాడులు నిర్వహించి తొమ్మిది మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. 16ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లు నుంచి ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తున్న రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు.పక్కా సమాచారంతో దేశెట్టిపల్లి ఫారెస్ట్ బీటు పరిధిలో కూంబింగ్ చేస్తూ బాలపల్లి అటవీప్రాంతం చేరుకున్నారు. అక్కడ కొందరు వ్యక్తులు రెండు కార్లతో కనిపించారు. వారిని టాస్క్ ఫోర్స్ పోలీసులు చుట్టుముట్టగా వారు పారిపోయే ప్రయత్నం చేశారు. అయితే టాస్క్ ఫోర్స్ పోలీసులు 9మందిని పట్టుకోగలిగారు. వారిని నంద్యాల, అన్నమయ్య జిల్లా, కర్నాటక కు చెందిన వారిగా గుర్తించారు. వాహనంలో లోడ్ చేసిన 16ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వారిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించగా వారిని డీఎస్పీలు వీ. శ్రీనివాస్ రెడ్డి, షరీఫ్ లు విచారించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





## బ్రహ్మంగారి కళ్యాణనికి మంత్రిని ఆహ్వానించిన పిట్ పర్సన్

**బ్రహ్మంగారిమఠం జూలై 21 ప్రభాతవార్త:**
జగద్గురువు శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణం లో ఏర్పాటు చేసిన నూతన కళ్యాణమండపంలో వచ్చే నెలలో జరిగే శ్రీ మాతా గోవింద మాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మాస కల్యాణ మహోత్సవమునకు రావాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ ఈ యొక్క మాస కల్యాణంలో స్వామి వారి భక్తులు అందరూ కార్యక్రమంలో పాల్గొనాలని అలాగే స్వామివారి రథం మాడవీధులు రోడ్డు విస్తరణకు ప్రభుత్వం తరఫున అన్ని విధాల సహాయ సహకారములు ఉంటాయని తెలియజేయడం జరిగింది. అనంతరం బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త రితీష్ కుమార్ రెడ్డి వారి కుమారుల పేరిట రెండు లక్షల రూపాయలు ఈ యొక్క మాస కళ్యాణంనకు శాశ్వత ఉభయదారులుగా ఉంటాము అని హామీ ఇవ్వడం జరిగినది. ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ అన్నారు.



## వెల్లాల దేవస్థాన అభివృద్ధికి మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

**రాజుపాళెం, జూలై 21, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని మూలవిరాట్ శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి 4కోట్ల సీజీఎఫ్ నిధులను మంజూరు చేయించిన ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డికి మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వర్ రెడ్డి, ఆలయ ఉత్సవ కమిటి చైర్మెన్ జీఎల్ నారాయణ రెడ్డి, మాజీ చైర్మెన్ రామసుబ్బారెడ్డి, టీడీపీ యువనాయకుడు దుద్దేల సుబ్బిరెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ వెల్లాల క్షేత్రంలోని శ్రీ సంజీవరాయ స్వామి ఆలయం నిర్మాణం భూమిపూజ కార్యక్రమనకు విచ్చేసిన సంధర్భంగా మూలవిరాట్ శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణంనకు కూడ నిధులు మంజూరు చేయిస్తానని ఇచ్చిన మాటకు కట్టుబడి ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి సీజీఎఫ్ నిధులు మంజూరు చేయించినందుకు వారు హర్శం వ్యక్తం చేస్తూ స్వామి వారి కృపతో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని వారు కోరుకున్నారు. దీంతో పాటు గోపల్లె, పర్లపాడు, కుమ్మరిపల్లె గ్రామాల్లోని మూడు ఆలయాలకు ధూపధీప నైవేద్యం కింద నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.



## పచ్చిరొట్ట ఎరువులతో భూమి సారవంతం..

**జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మరియు జెసి..**

**కడప కలెక్టరేట్, జులై 21, ప్రభాతవార్త**
పచ్చిరొట్ట ఎరువులతో భూమి సారవంతం అవుతుందని జిల్లా ఇంచార్జి కలెక్టర్ మరియు జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సభా భవన్ నందు జిల్లా వ్యవసాయ శాఖ వారిచే "పచ్చిరొట్ట ఎరువు తో మట్టికి జీవం" నకు సంబంధించిన గోడ పత్రికల ను జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుతో మట్టికి జీవం అని,పచ్చి రొట్టె ఎరువు మట్టి యొక్క నీటి నిలుపుదల సామర్థ్యాన్ని పెంచుతుందని,మొక్కలు వేగంగా పెరగడం వలన కలుపు మొక్కలు పెరుగుదలను అరికడతాయని తెలిపారు. మొక్కలకు అవసరమైన నత్రజని భాస్వరం పొటాషియం అండ్ పోషకాలను నేలకు అందించడంలో పచ్చిరొట్ట ఉపయోగపడుతుందన్నారు. ఈ గోడ పత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర్ నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రా నాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు

**దువ్వూరు, జూలై 21, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వివిధ రహదారుల్లో మద్యం సేవించి వాహనం నడిపితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని దువ్వూరు ఎస్ఐ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మద్యం మత్తులో వాహణాలు నడిపిన నలుగురు వ్యక్తులకు కేసులు నమోదు చేశామన్నారు. వీటిని సోమవారం మైదుకూరు కోర్టుకు హాజరుపరచగా జూనియర్ సివిల్ జడ్జీ ఒక్కొక్కరికి 10వేల రూపాయలు చొప్పున జరిమాన విధించారన్నారు. అందువల్ల ఎవరైనా సరే మద్యం సేవించి వాహణం నడపాలన్నారు. పెద్దభాకరాపురం, అమృతనగర్, దువ్వూరు, ఇడమడక గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులకు జరిమాణా విధించారన్నారు. మద్యం సేవించి నడిపేది వాహణం కాదని శవపేటిక అన్నారు. తాగిన మత్తులో వాహణం నడిపితే నింపిన వ్యక్తిని ఎదుటి వ్యక్తికి ప్రాణప్రాయం ఉంటుందని దీంతో కుటుంబం వీధిన పడుతుందన్నారు. ఇప్పటికైనా గమనించి వాహనదారులు ఎవరైనా సరే మద్యం సేవించి వాహణం నడపరాదన్నారు. ఇటీవల ప్రభుత్వం కఠిన నిబంధనలు విధించిందని వాటిని తప్పకుండా పాటించాలని ఆయన కోరారు.

## సుపరిపాలనలో తొలి అడుగు

**బ్రహ్మంగారిమఠం జూలై 21 ప్రభాతవార్త:**
సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రేకులకుంట పంచాయతీ లో బూత్ నెంబర్ 230 లక్ష్మీ బాలాజీ నగర్ నందు ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మాజీ మండలాధ్యక్షులు మాలేపాటి సుబ్బారావు, టిడిపి మండల యువ నాయకులు కానాల మల్లికార్జున రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జులు అమరావతి,వెంకటసుబ్బయ్య, పెరుగు వీరయ్య, టిడీపి కార్యకర్తలు జయన్న,పెంచలయ్య, కృష్ణయ్య,పెరుగు పెద్ద వీరయ్య, గుజ్జు రామాంజనేయులు, పుటాల శివ యాదవ్,బ్రహ్మనాయుడు,కిట్టి గారి వెంకటేశు,రాజారత్నం నరసయ్య,సిద్ధం డెన్నీ,మల్లేష్, తదితరులు పాల్గొనడం జరిగింది.



## వైసీపీ అధికారంలోకి వస్తే వడ్డీతో సహా చెల్లించుకుంటా

**మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్ రెడ్డి**

**లక్కిరెడ్డిపల్లి; జూలై 21, ప్రభాత వార్త**
నాపైన కక్షగట్టి కేసులు బలాయించి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు వైసీపీ అధికారంలోకి వస్తే వడ్డీతో సహా చెల్లించుకుంటానని మాజీ ఎమ్మెల్యే వైసిపి హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు ఆర్ రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు సోమవారం తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ నా గుండెలు చించే మొగోడు ఎవడు ఉన్నాడు శించించుకోవడానికి సిద్ధంగా ఉన్న రాయచోటిలో నాకెంత బలం ఉందో నాకు పది రెట్లు బలం ఉంది రాబోయే కాలంలో నోరు ఉందని మాట్లాడి నన్ను బెదిరిస్తారా ఇలాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు ఎప్పుడైనా ఎక్కడికైనా వస్తాను గౌరవంగా తన పదవికి న్యాయం చేయాలని కోరుకుంటున్నా నువ్వు నీ ప్రభుత్వము నన్ను ఏమీ చేయలేవు అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి మాజీ మార్కెట్ చైర్మన్ కాలనీ ప్రభాకర్ రెడ్డి వెంకటేష్ మాజీ ఎంపీపీ అంబాబత్తెన రెడ్డయ్య తదితరులు వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ కుమార్ రెడ్డి

## నేతాజీ నగర్‌లో చోరీ

**ప్రొద్దుటూరు క్రైం, జులై 21, ప్రభాతవార్త:**
పట్టణంలోని నేతాజీ నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారని వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై సంజీవరెడ్డిలు తెలిపారు. 1, 2 వీధుల్లోని 2 ఇళ్లలో చోరీకి పాల్పడి 6 తులాలు బంగారు, రూ.1.10లక్షలు నగదు చోరీ చేయడం జరగిందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టడం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**దువ్వూరు, జూలై 21, ప్రభాతవార్త:**
ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను తహసీల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎక్కువ మంది రైతులు, ప్రజలు వచ్చి తమ సమస్యను విన్నవించుకున్నారు. రీ సర్వేలో జరిగిన పొరపాట్లు, భూముల కొలతల్లో ఎక్కువగా తేడాలు ఉన్నాయని వాటిపై ధరఖాస్తులు వచ్చాయి. వీటిన్నింటిని సంబంధిత వీఆర్వోలకు, సర్వేయర్లకు పంపారు. అనంతరం వారు మాట్లాడుతూ సమస్యలు వచ్చిన వెంటనే వాటిని 15రోజుల్లోగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, ఈఓపిఆర్డి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఆషాడ మాస ఆడికృత్తిక మహోత్సవం

**రామసముద్రం,జులై 21 ప్రభాతవార్త**
రామసముద్రం మండల కేంద్రంలోని దిగుపేటలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న పార్వతిదేవి సమేత శ్రీ చంద్ర శేఖర స్వామి వారి ఆలయం నందు ఆషాడ బహుళ త్రయోదశి మంగళవారం శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామి వారి కళ్యాణోత్సవం సాయంత్రం 5 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహింపబడునని,రాత్రి 8 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలియజేశారు. బుధవారం రాత్రి 7 గంటలకు శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి గ్రామ ఉత్సవం నిర్వహింపబడుని,అన్నదాన కార్యక్రమం ఉంటుందని అన్నారు. కావున భక్తులందరూ విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని తెలియజేశారు.

## మిట్స్ లో హ్యూమన్ వాల్యూస్ పై ఐదు రోజుల శిక్షణ విజయవంతం

కురబలకోట, జులై 21 ప్రభాతవార్త
కురబలకోట మండలం అంగళ్ళు లో నున్న మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్, మదనపల్లె కళాశాలలో ఏ.ఐ.సి.టి.ఈ మరియు యెన్.సి.సి వారి ఆధ్వర్యంలో యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ పై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ విజయవంతంగా నిర్వహించబడిందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. యశ్వంత్ పాటిల్, శివాజీరావ్ ఎస్ జొంధ్లే ఇంజినీరింగ్ కళాశాల, మహారాష్ట్ర పాల్గొన్నారు. కార్యక్రమం లో యశ్వంత్ పాటిల్ మాట్లాడుతూ యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ అనే విలువల బద్ధమైన విజ్ఞానం కోర్సును పద్ధతిగా "స్వీయ అన్వేషణ" ద్వారా అధ్యాపకులు మరియు విద్యార్థులు కలిసి అన్వేషణ చేయడం వీలు పడుతుందని అన్నారు. అంతేకాకుండా మానవుని యొక్క అంతిమ లక్ష్యం సంతోషంగా మరియు ఐశ్వర్య వంతంగా ఉండడం. కానీ మనం ఈ విషయాన్ని మర్చిపోయి వివిధ రకాల కార్యక్రమాలను శ్రమతోటి భౌతిక అవసరాల కోసం తాపత్రయ పడుతూ ఉంటాము. ఎప్పుడైతే మనకు సంతోషము మరియు ఐశ్వర్యవంతము కావాలనుకుంటాము. అది సరియైన అవగాహనతోటి సిద్ధిస్తుంది. జంతువులకు భౌతిక అవసరాలు మాత్రమే సరిపోతాయి కానీ మనుషులకు భౌతిక సదుపాయాలు తోపాటుగా గౌరవ మర్యాదలు కూడా కావాలి. సరైన అవగాహన తోటి మాత్రమే సాధ్యమవుతుంది. సరైన అవగాహన అనేది మనిషి యొక్క అవసరాల్లో భౌతిక అవసరాలనేటివి పాక్షికము మరియు తాత్కాలికము. మనిషికి కావలసిన సంతోషము మరియు ఐశ్వర్యము అనేది నిరంతర ప్రక్రియ. ఈ విషయానికి సంబంధించి అవగాహనను అధ్యాపకుల యందు విస్తృతంగా చొప్పించుట కొరకు తరగతులను నిర్వహించారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా అధ్యాపకులు తమ వ్యక్తిగత, సామాజిక బాధ్యతలను తెలుసుకుని, విలువల బద్ధంగా జీవితాన్ని గడపడం ఎలా అనేది తెలుసుకునే అవకాశాన్ని పొందగలరు అని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్ అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కే శేషమహేశ్వరమ్మ, వైస్ ప్రిన్సిపాల్ జే.ఎన్.టి.యూ పులివెందుల, బి. రాఘవమ్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్.బి.కే.ఆర్ ఐ.టి, నెల్లూరు మరియు కళాశాల వివిధ విభాగాల నుంచి 70 మంది పైగా అధ్యాపక బృందం, సమన్వయకర్తలు డా. బి. జగదీశ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



## అన్నప్రసాద వితరణ



ప్రొద్దుటూరు అర్బన్, జులై 21 ప్రభాతవార్త :
స్థానిక అగస్త్యేశ్వరాలయంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో శివోహం ఛైర్మన్ శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి సహకారంతో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 500 మంది ప్రజలు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా శివోహం సభ్యులు మాట్లాడుతూ స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శెట్టిపల్లె సుబ్బరామిరెడ్డి పర్యావరణ పరిరక్షణ కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో శివోహం కమిటీ ఉపాధ్యక్షులు మురుకూటి సూర్యనారాయణ, సభ్యులు విష్ణు నారాయణ, విజయకుమార్, కల్లూరు ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్న ప్రభుత్వం

రాష్ట్ర ఎస్సీ సెల్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్.టి.డి హరి



పీలేరు జూలై 21 ప్రభాతవార్త:
మూడుసార్లు రాజంపేట పార్లమెంటు సభ్యుడుగా ఎన్నికలలో పోటీ చేసి అత్యధిక మెజార్టీతో ప్రజల అండతో గెలుపొందిన పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురిచేసిన భయపడేందుకు సిద్ధంగా లేరని రాష్ట్ర వైకాపా ఎస్సీ సెల్ కార్యదర్శి ఎస్.టి.డి హరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన తనయుడు మిథున్ రెడ్డిని రాజ్యాంగబద్ధంగా ఎదుర్కోలేకనే ఇటువంటి తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్క వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు మిథున్ రెడ్డి అరెస్ట్ పట్ల విచారం వ్యక్తం చేయడమే కాకుండా ఆయనకు సంఘీభావం కూడా తెలుపుతున్నట్లు ఆయన అన్నారు రాష్ట్రంలో ఇప్పటికే కోటమ్మ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందని అది జీర్ణించుకోలేక ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరిని తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు ఆయన తనయుడు లోకేష్ కు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి మాయని మచ్చగా నిలబడి పోతుందని హరి అన్నారు. ఇటువంటి తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసి జైలుకు పంపిస్తున్న వాటిపై సుప్రీం కోర్టు ప్రత్యేకంగా చొరవ తీసుకొని న్యాయబద్ధంగా విచారణ చేపట్టి అమాయకులైన మిథున్ రెడ్డిని చట్టాన్ని కాపాడాలని ఆయన వేడుకున్నారు. ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం తోనే పరిపాలన కొనసాగించాలని అది కాకుండా రెడ్ బుక్ పాలనలో రాష్ట్రంలో పరిపాలన జరుగుతున్నదని ఇకనైనా వాటికి అడ్డు చెప్పాలని లేని పక్షంలో రాష్ట్ర ఎస్సీ లందరూ మేలుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.

## నిత్యవసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి



కురబలకోట, జులై 21 ప్రభాతవార్త :
ప్రతినెలా 1నుంచి 15వ తేది వరకు కార్డుదారులకు డీలర్లు నిత్యవసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ దనాంజనేయులు చెప్పారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో చౌకదుకాణ డీలర్ల సమావేశం నిర్వహించారు. ప్రతినెల చివరిలో 26నుంచి 30 వరకు వృద్దులు, దివ్యాంగులకు ఇంటివద్దకే రేషన్ సరుకులను డీలర్లు పంపిణీ చేయాలన్నారు. షాపుల్లో స్టాక్‌బోర్డులను ఉంచాలన్నారు. స్టాక్ ఉన్నంతవరకు ప్రతి డీలర్ లాగిన్ కావాలని కోరారు. నిర్ణయిత సమయాల్లో రనేషన్ పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం డిటి చాణిక్యను డీలర్లు సన్మానించారు. ఈ సమావేశంలో సిఎస్ డిటి, డీలర్లు పాల్గొన్నారు.

## రమేష్‌రెడ్డీ నోరు అదుపులో పెట్టుకో..

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జోలికి వస్తే ఖబడ్దార్
- టీడీపీ నాయకుల హెచ్చరిక

గాలివీడు, జులై 21(ప్రభాతవార్త):
రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డిపై కనీస గౌరవం లేకుండా రౌడీలు, గూండాలు అంటూ స్థాయి మరిచి నోరు పారేసుకోవడం మంచి పద్ధతి కాదని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డిని టీడీపీ నాయకులు హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక టీడీపీ నాయకులు హేమకుమార్‌రెడ్డి నివాసంలో టీడీపీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఆవుల వెంకటనారాయణరెడ్డి, మాజీ సర్పంచులు బసవరాజు శ్రీనివాసరాజు, ఫరీద్‌బాషా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటశివారెడ్డిలు మాట్లాడుతూ 1999 నుంచి 2019 వరకు ఐదు పర్యాయాలు టీడీపీ పుణ్యమా అని ఎన్నికల్లో పోటీ చేశారు.. అందులో ఒకసారి గెలుపొందగా మూడు సార్లు ఓడిపోయావని ఎద్దేవా చేశారు. నిన్ను ఎమ్మెల్యేను చేసిన ఘనత టీడీపీ పార్టీకే చెందుతుందని, అలాంటి పార్టీని, పార్టీ అధినేతను, మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని విమర్శించడం నీకు సిగ్గుగా లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నీకు భవిష్యత్తు ఇచ్చిన టీడీపీని విమర్శించడం తల్లిపాలు తాగి రొమ్ము గుద్దినట్లుగా ఉన్నదని గుర్తుకు చేశారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల కష్టసుఖాలలో పాలు పంచుకుంటున్నాడని తెలిపారు. ఒక సంవత్సరం కాలంలోనే రాయచోటి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తూ కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చారన్నారు. వైసీపీలో ఉన్న ముగ్గురు మాజీలు వారికి తోచిన విధంగా మంత్రిని విమర్శించడం వారి అనైతికతకు నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## శ్రీనివాసులురెడ్డికి జిల్లా కార్యవర్గంలో ప్రాధాన్యత



గాలివీడు, జులై 21(ప్రభాతవార్త):
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సంస్థాగత మార్పుల నేపథ్యంలో గాలివీడు మండల బీజేపీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న గొట్లమిట్ట శ్రీనివాసులురెడ్డి తాజాగా అన్నమయ్య ఇజల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, తనకు ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర, జిల్లా నాయకత్వ సూచనలు సలహాల మేరకు బీజేపీ బలపడేందుకు, అలాగే ప్రజల సమస్యలపై సమర్థవంతంగా పనిచేసేందుకు కృషి చేస్తానని శ్రీనివాసులురెడ్డి అన్నారు. పార్టీ శ్రేణుల నుండి ఆయనకు వస్తున్న అభినందనలు, శుభాకాంక్షలు కొనసాగుతున్నాయి. ఈ నియామకంతో గాలివీడు మండలంలో బీజేపీ మరింత శక్తివంతం కావచ్చన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

## గ్రీవెన్స్‌డేలో పలు రెవెన్యూ సమస్యలు పరిష్కారం

కలికిరి, జులై 21, ప్రభాతవార్త:



జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు కలికిరి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ హరికుమార్ గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించి కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. కొన్ని సర్టిఫికెట్లను మంజూరు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మరికొన్ని రెవెన్యూ సమస్యలను తమ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. మండలంలో ఇప్పటికే పంచాయతీలలో రీ సర్వే పూర్తి కావడం జరిగిందని ఆ రీ సర్వేలలో పలు సమస్యలు రైతులకు రావడం జరగిందని వాటని పరిష్కరించడం జరుగుతుందని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ప్రసాద్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, దశరథ, ఆదిలక్ష్మి, నరేష్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ గిరి తదితరులు పాల్గొన్నారు.

## మసీదు నిర్మాణం ఆపాలని కలెక్టర్‌కు వినతి




సుండుపల్లె, జులై 21, ప్రభాతవార్త :
అనుమతులు లేని అక్రమ మసీదు నిర్మాణాన్ని ఆపాలని కలెక్టర్ కు వినతిపత్రాన్ని రాజంపేట బిజెపి అసెంబ్లీ కన్వీనర్ రామ జగదీష్ స్వామి అందజేశారు. మండల కేంద్రానికి సమీపంలోని అక్కంపల్లె జగనన్న కాలనీలో పేదవారికి ఇండ్లకు స్తలాలు ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని అయితే అక్కడ కొందరు వ్యక్తులు హిందువులు ఉన్న ప్రాంతంలో వారి ఇండ్లు కు మధ్యలో అనుమతులు లేని అక్రమ మసీదు నిర్మాణాన్ని చేపడుతున్నారని స్థానికులు బిజెపి రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ రామ జగదీశ్ స్వామి దృష్టికి తీసుకోవడంతో సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై వెంటనే స్థానిక తాసిల్దార్ మెహబూబ్ చాంద్ కు చరవాణి ద్వారా ఇండ్ల మధ్యలో చేపడుతున్న మసీదు నిర్మాణాన్ని ఆపాలని ఆదేశించడంతో అక్కంపల్లి జగనన్న కాలనీలో అక్రమ మసీదు నిర్మాణాన్ని పరిశీలించారు, ఇండ్ల మధ్యలో మసీదు నిర్మాణం చేపట్టరాదని నిర్మాణాన్ని ఆపివేయాలని గ్రామ రెవెన్యూ అధికారి బసయ్యకు సూచించారు.

## స్కూల్ బస్సును వెనుక ఢీకొన్న జెసిబి..

సుండుపల్లి, జులై 21, ప్రభాతవార్త :




రాయవరం పించా క్రాసు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం స్కూల్ బస్సును వెనకవైపు నుంచి ఢీ కొట్టిన జెసిబి పించా వైపు నుండి సుండుపల్లి వైపు వెళుతున్న స్కూల్ బస్సును రాయవరం వైపు నుండి వస్తున్న జెసిబి బస్సు ఢీ కొనడంతో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 50 మంది పిల్లలు సురక్షితంగా బయట పడ్డారు. జెసిబి డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు ఈ సంఘటనలో విద్యార్థులు సురక్షితంగా బయటపడడంతో పాఠశాల యజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

## సంపూర్ణ మద్య పాన నిషేధాన్ని అమలు చేయాలి



వేంపల్లి: జులై 21 (ప్రభాత వార్త):
సుపరి పాలన పట్ల,ప్రజా సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో సంపూర్ణ మద్య పాన నిషేధాన్ని అమలు చేయాలని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ మద్యం కుంభకోణం లో వెలుగు చూస్తున్న విషయాల ద్వారా జగన్ పులివెందుల పరువు,కడప జిల్లాపరువు తీశాడని,ముఖ్యమంత్రి పదవికి కళంకం తెచ్చాడని ఆవేదన వెలిబుచ్చారు. త్రాగుబోతుల రక్తంతో ప్రభుత్వాలను నడపాలని,రాజకీయాలు చేయాలని అనుకోవడం సిగ్గు చేటు. మండలానికి 4 మద్యం షాపులు, 40 బెల్ట్ షాపులు గా మద్యం పాలసీ తయారయింది. సంపూర్ణ మద్య పాన నిషేధాన్ని అమలు చేస్తే కొందరు రాజకీయ నాయకులకు మాత్రమే నష్టం. మద్యం కుంభకోణాలు జరగ కుండా ఉండాలంటే సంపూర్ణ మద్య పాన నిషేధాన్ని అమలు చేయాలని తులసి రెడ్డి అన్నారు.

## దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ముఖ్యమంత్రి

పీలేరు జులై 21 ప్రభాతవార్త :
కంభం వారిపల్లికి చెందిన కంభం ప్రభాకర్ రెడ్డి ఇటీవల పరమపదించారు. సోమవారం దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ముఖ్యమంత్రి, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, నల్లారి సంతోష్ కుమార్ రెడ్డి ముగ్గురు సోదరులు ఒకే కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.

## ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ తగదు..

కడప కార్పొరేషన్ జూలై 21 ప్రభాతవార్త:




పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి అక్రమ అరెస్ట్ ను వైసిపి నాయకులు, గల్ఫ్ కన్వీనర్ పి హెచ్.ఇలియాస్, గల్ఫ్ అడ్వైసర్ నాయని మహేశ్వర్ రెడ్డి ఖండించారు. సోమవారం విలేకరులతో వారు మాట్లాడుతూ భారత దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలలో డా.బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తుంటే ఏపీలో మాత్రం లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని, అందుకే ప్రతిపక్ష వైసిపి నాయకులను టార్గెట్ చేస్తూ అక్రమంగా అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు రానున్న ఎన్నికల్లో టిడిపికి బుద్ధి చెప్తారన్నారు. అనంతరం కువైట్ కో కన్వీనర్ మన్నూర్ చంద్రశేఖర్ రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు పి.సురేష్ కుమార్ రెడ్డి, వి.పి. రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ ఇతర దేశాల్లో ఉన్న తెలుగు వారు మరణించిన వారి కోసం, అనారోగ్య కారణంగా నడవలేక ఇండియా వచ్చే వారిని ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేసి తమ స్వగృహాలకు చేర్చేన మనసున్న మహారాజు ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో కువైట్ ఎన్నారైలు గాడి గోపాల్ రెడ్డి, వి.సి. సిద్ధారెడ్డి, నాగ జయకుమార్ రెడ్డి, డా. సుమాంత్ కుమార్ రెడ్డి, షేక్. అజీమ్ పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఆకేపాటి.



చిట్వేలి, జూలై 21, ప్రభాతవార్త:
భారతీయ జనతా పార్టీ అన్నమయ్య జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా చిట్వేలి గ్రామ వాసి ఆకేపాటి వెంకటరెడ్డి ఎంపికయ్యారు. మూడుసార్లు మండల బిజెపి అధ్యక్షునిగా, రెండు సార్లు ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులుగా గతంలో తాను పనిచేశారు. నిబద్ధతతో పనిచేసే వారికి భాజపా పెద్దపీట వేస్తుందనడానికి ఆకేపాటి చక్కటి ఉదాహరణ అని పలువురు ప్రశంసించారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆకేపాటి తెలిపారు. తాను ఈ పదవిని పొందడంలో సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు మాధవన్ కు, జిల్లా భాజపా అధ్యక్షులు సాయి లోకేష్ కు, మరియు భాజపా పెద్దలకు ఆకేపాటి వెంకటరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## మీడియా సమావేశం ద్వారా ఖండించిన నాయకులు

చిన్నమండెం జూలై 21 ప్రభాత వార్త:



మండలంలో ఆదివారం జరిగిన వైసిపి పార్టీ సమావేశంలో మాజీ యం ఎల్ ఏ రమేష్ రెడ్డి మాట్లాడిన దూషణలను టిడిపి నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు,మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిలపై వక్రీకరించి మాట్లాడితే తగిన బుద్ధి చెపుతామన్నారు. రాయచోటికి సరైన వ్యక్తే మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అని అధిష్టానం టికెట్ కేటాయించారు. మీరంతా కలిసి వచ్చినప్పటికీ ప్రజలను నమ్ముకున్నారు ఈ రోజు గెలుపొంది మంత్రి విస్తరణలో చోటు దక్కించుకున్నారు. మంత్రికి మంచి పేరు వస్తుందన్న కుట్రతోనే కదిరి వాండ్ల పల్లిలో జరిగిన కార్యక్రమంలో నోరు పారేసుకోవడం మంచి పద్దతేనా, టిడిపితో పదవులు అనుభవించిన నువ్వు టిడిపి పార్టీని,సీఎం చంద్ర బాబు నాయుడు,మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ల పై అసత్య ఆరోపణ దూషణలు చేయడం మేము సహించబోమన్నారు. ఇప్పటికైనా ఇలాంటి చౌకబార మాటలు మాట్లాడకన్నా బుద్ధి తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## టీడీపీ సుపరిపాలనలో సంతోషంగా ప్రజలు

రాజుపాళెం, జూలై 21, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన రాజుపాళెం గ్రామంలో సోమవారం 15వ వార్డులో ఇంచార్జ్ సానా శ్రీనివాసుల రెడ్డి, మాజీ సర్పంచ్ బీవి కృష్ణారెడ్డిలు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల వల్ల కలిగే లబ్ది గురించి ప్రజలకు వివరిస్తూ టీడీపీ సుపరి పాలనలో సంతోషంగా ప్రజలు ఉన్నారని వారు తెలిపారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, యువ నాయకుడు కొండా రెడ్డిల ఆదేశాల మేరకు గ్రామంలోని 15వ వార్డులో టీడీపీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సానా వెంకటేశ్వర్ రెడ్డి, గోవింద రెడ్డి, రమణారెడ్డి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## మోకాళ్లపై బిక్షాటన చేస్తూ మున్సిపల్ కార్మికుల నిరసన



రాజంపేట, జూలై 21 ప్రభాతవార్త
సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం నాటికి ఆరో రోజుకు చేరుకుంది. ఆరవ రోజు మున్సిపల్ కార్మికులు మోకాళ్లపై కూర్చుని పైన బిగ్ షాట్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూజిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేల్ రవికుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పివి రమణ, ఓబయ్య ,ప్రసాదు, రవిశంకర్, సాలయ్య ,సునీత ,బుజ్జమ్మ ప్రమీల ,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సబ్ స్టేషన్ నైట్ వాచ్మెన్ మృతి

సిద్ధవటం జూలై 21 ప్రభాతవార్త
సిద్ధవటం మండలం కడప చెన్నై రహదారిలోని పెద్దపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో సబ్ స్టేషన్ నైట్ వాచ్మెన్ గా పనిచేసే నారపురెడ్డి రామచంద్రా రెడ్డి (55) మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చాముండీశ్వరి పేటకు చెందిన నారపురెడ్డి రామచంద్రా రెడ్డి పెద్దపల్లి విద్యుత్ సబ్ స్టేషన్లో నైట్ వాచ్మెన్ గా విధులు ఇంటి నుంచి బయలుదేరారు. పెద్దపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా రోడ్డు దాటుకుంటుండగా తిరుపతి నుంచి కడపకు వెళ్తున్న ఎలక్ట్రికల్ బస్సు ఢీకుంది. కింద పడిపోయిన రామచంద్రా రెడ్డి బస్సు వెనుక టైర్లు అతని తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ బస్సును ఆపకుండా తప్పించుకునే ప్రయత్నం చేయగా సిద్దవటం ఎస్సై మహమ్మద్ రఫీ మరియు పోలీస్ సిబ్బందిమండల శివారులోని జేఎంజే కళాశాల వద్ద నున్న అటవీశాఖ చెక్ పోస్టు వద్ద బస్సును నిలబెట్టి డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం కాగా, కుమారుడు అట్లూరు విద్యుత్ సబ్ స్టేషన్లో ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారిస్తున్నారు. ఈ మేరకు మృతదేహాన్ని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తామని సిద్ధవటం ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు .

## అదుపు తప్పి స్తంభాన్ని ఢీ కొట్టిన ఆటో

బద్వేలు, జూలై 21, ప్రభాతవార్త
బద్వేల్ పోరుమామిళ్ల ప్రధాన రహదారి నక్కల గండి వద్ద అదుపుతప్పి సోమవారం విద్యుత్ స్తంభాన్ని ఆటో ఢీకొంది.ఆటోలో ప్రయాణిస్తున్న 15 మందిలో ఐదు మందికి గాయాలయ్యాయి క్షతగాత్రులను 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఒక మహిళ పరిస్థితి విషమంగా ఉండడంతో కడపకు రిమ్స్ కు వైద్యులు రెఫర్ చేశారు. వీరు కూలి పని నిమిత్తం మేకపారి పల్లె గ్రామం నుంచి నెల్లూరు జిల్లా ,సోమశిల మండలం గోవిందాయ పల్లెకు వెళుతున్నట్లు సమాచారం

## అడ్డంకులు తొలగించాలి..
## రక్షణ గోడ నిర్మించాలి..

కడప కార్పొరేషన్, జూలై 21 ప్రభాతవార్త:
కడప నగరం వన్ టౌన్ సర్కిల్ లో విజయ హోటల్ దగ్గర ఉన్న ప్రభుత్వం స్థలంలో అక్రమంగా ప్రవేట్ వ్యక్తుల వ్యాపారాలు పాన్ దుకాణాలు వంటివి వెలిశాయి. వాటి ద్వారా ఆదాయం వస్తుందని కార్పొరేషన్ అధికారులు పట్టిం చుకోవడం లేదు. మన్మందిర్ షాప్ ఎదురుగా పాన్ బిడా పక్కనే పెద్ద ట్రాన్స్ ఫార్మర్ కు రక్షణ గోడ కూడా లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నది. ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ 20 అడుగులు దూరం గోడను విద్యుత్ అధికారులకు నిర్మించ లేదు. వైవి స్ట్రీట్, బీకేం స్ట్రీట్ వ్యాపార సముదాయాల ప్రాంతాలకు నిత్యం మహిళలు పిల్లలు పెద్దలు రాకపోకలు కొనసాగిస్తున్నారు. పాన్ బీడ కోసం వచ్చే ఆకతాయిలు మహిళలను కామెంట్ లు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనాలు అక్కడే పార్క్ చేయడం కారణం గా ట్రాఫిక్ కూడా అంతరాయం ఏర్పడుతుంది. అక్కడ అక్రమంగా వెలిసిన దు కాణాలను తొలగించాలని స్థానికులు కార్పొరేషన్ అధికారులను కోరుతున్నారు.



## పులివెందుల అంటే కక్ష సాధింపు తగదు

పులివెందుల,జూలై 21, ప్రభాత వార్త:
పులివెందుల అంటే కూటమి ప్రభుత్వం నకు కక్ష సాధింపు తగదు అని మున్సిపాలిటీ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంలో పోస్టులు అన్ని ఖాళీగా ఉన్నాయి అధికారులు లేక అభివృద్ధి పనులు అన్ని ఆగిపోయాయి అని ఆ శాఖలకు సంబంధించి అధికారులను నియమించాల ని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మరియు కౌన్సిలర్లు ప్లే కార్డ్స్ పట్టుకొని నిరసన కమిషనర్ ఛాంబర్ నందు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లతో కలిసి నిరసన చేపట్టిన అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో మేనేజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, డి ఈ, ఏఈ లు ఖాళీగా ఉన్నాయని దీనివల్ల పనులు ఆగిపోవడం జరిగిందన్నారు. గత రెండు సంవత్సరాలు స్వచ్ఛ మున్సిపాలిటీగా అవార్డు తీసుకోవడం జరిగిందని, అధికారులు లేకనే మూడోసారి అవార్డు రాలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి నియోజకవర్గం కావడం వల్లే అధికారులు నియమించలేదని పులివెందుల అంటే అంత చిన్నచూపు ఎందుకని ఒక చిన్న పని కూడా చేయలేక పోతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కోఆప్షన్ సభ్యుడు చంద్రమోళి, కౌన్సిలర్లు కిషోర్, భార్గవి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## యాప్‌ల భారాన్ని తగ్గించాలి




బద్వేలు అర్బన్, జూలై 21 ,ప్రభాతవార్త
అంగన్వాడి కార్యకర్తల పై ప్రభుత్వం యాప్ ల భారం తగ్గించాలని లేకపోతే వారు తీవ్ర మనస్థాపానికి గురయ్యే ప్రమాదం ఉందని సిఐటియు జిల్లా కార్య దర్శి కె.శ్రీనివాసులు పేర్కొన్నారు .ఈ మేరకు సోమవారం ఆయన పలువురు అంగన్వాడి కార్యకర్తలతో కలిసి బద్వేల్ సిడీపిఓ శ్రీదేవి కి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గంటకో యాప్ ప్రవేశ పెడుతూ అంగన్వాడీలను ఇబ్బందులకు గురిచేస్తుందని దీనివల్ల వారు మానసి కంగా మరియు ఆరోగ్యపరంగా కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అంగన్వాడీ కార్యకర్తలను తీవ్ర మనస్థాపానికి గురి చేస్తున్న యాప్‌లను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ కె. నాగేంద్రబాబు, కో కన్వీనర్ పి.సి.కొండయ్య, యూనియన్ ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలు కె. సుభాషిని, ప్రాజెక్టు నాయకురాలు జయప్రద, లక్ష్మీనరసమ్మ,కె.వి సుభాషిణి, సుజాత, అమ్మణ్ణి, తదితరులు పాల్గొన్నారు.

## పి 4 విధానంతో పేదల జీవితాలలో వెలుగులు




బద్వేలు ,జూలై 21 , ప్రభాతవార్త
ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ 4 (బంగారు కుటుంబం ) విధానం ద్వారా పేదల జీవితాలలో వెలుగులతో పాటు వారికి సహాయం అం దించే కుటుంబాల వారికి సంతృప్తి కలుగుతుందన్నారు. ఈ పీ 4 విధానంపై నిర్వహించే సర్వే నిక్కచ్చిగా నిర్వహించాలని ఎంపీడీవోలకు ఆర్టీవో చంద్రమో హన్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు సోమవారం నియోజ కవర్గ ఎంపీడీవోలతో పాటు మున్సిపల్ కమిషనర్ తో ఆయన సమావేశం ని ర్వహించారు. ఈ సందర్భంగా పీ 4 విధానంపై వారికి అవగాహన కల్పించారు. ఈ విధానంతో పేదలు ఆర్థికంగా ఎదగగలరని, తద్వారా ప్రజలలో సమానత్వ భావన ఏర్పడుతుందని తెలిపారు. ఈ విధానంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా తీసుకోవాలని సూచించారు.

## కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం

పులివెందుల,జూలై 21, ప్రభాత వార్త:
కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని నియోజక వర్గ ఇన్చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం పులివెందుల మున్సిపాలి టీలోని ఎర్రగుడిపల్లెలో పర్యటించి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎర్రగుడి పాలెం గ్రామానికి చేరుకున్న బీటెక్ రవికి స్థానికులు ఘనంగా స్వాగతం పలికి గజమాలతో ఆహ్వానం పలుకుతూ సత్కరించారు. అనంతరం ఆయన ఇంటింటికి తిరిగి ఈ సంవత్సర కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన ప్రతి పథకాన్ని అమలు చేస్తుంది అని ఒక పక్క అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని పరుగు లెత్తిస్తూ మరో వైపు ప్రజా సంక్షేమం కోసం పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే వారి వద్ద నుండి సలహాలు సూచనలు స్వీకరించారు.ఈ కార్యక్ర మంలో పులివెందుల మున్సిపాలిటీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి

కాశినాయన జులై 21 ప్రభాతవార్త ::



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పెండింగ్లో ఉన్న రూ.6400 కోట్ల విడుదల చేయాలని సోమవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ లో DRO విశ్వేశ్వర నాయుడుకి వినతి పత్రం అందించిన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏర్పడి సంవత్సరం కాలం అవుతా ఉంది విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైంది. పెండింగ్లో ఉన్న పాఠ్యపుస్తకాలు, విద్యా కానుక విడుదల చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలి. జిల్లా వ్యాప్తంగా అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలనీ, ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టు వర్కర్స్, పోస్టులు భర్తీ చేయాలి.ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనారిటీ హాస్టల్లో విద్యార్థులు సమస్యలు పరిష్కరించాలి. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, నగర కార్యదర్శి మోహన్, నగర ఉపాధ్యక్షులు శ్రీనివాస్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మోహనరెడ్డిని పరామర్శించిన గోవిందరెడ్డి



కాశినాయన జులై 21 ప్రభాతవార్త

నరసాపురం గ్రామానికి చెందిన కర్నాటి మోహన్ రెడ్డి ఇటీవల కాలునకు వైద్య చికిత్స తీసుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, యువ నాయకులు మరియు రాష్ట్ర విద్యార్థి విభాగ ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మోహన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు క్లాస్ వన్ కాంట్రాక్టర్ పంగా గురివిరెడ్డి రీలి వెంకటరెడ్డి, బోయిల్ల రమణారెడ్డి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చినుకు పడితే చెరువును తలపిస్తోంది.వర్షం నీరు,

మైదుకూరు, జులై 21, ప్రభాతవార్త:



నిత్యం వేల సంఖ్యలో వాహనాలు నడుస్తున్న మైదుకూరు మున్సిపాలిటీ పోరుమామిళ్ల రహదారిలో కేసీ కెనాల్ నూతన బ్రిడ్జి దగ్గర చినుకు పడితే చెరువును తలపిస్తోంది. వర్షం నీరు వెళ్లకుండా ఆక్రమణదారులు సైడ్ కాలవలను మూసివేయడంతో రహదారి పై చెరువును తలపించేలా నీరు నిలుస్తోంది. దీని పై అధికారులు దృష్టి పెట్టడం లేదని స్థానికులు, వాహన దారులు మండిపడుతున్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మున్సిపాలిటీలో కొన్నిచోట్ల చెరువును తలపించేలా వర్షపు నీరు రోడ్ల పై నిలిచి వాహనదారుల రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది.వర్షపు నీరు వెళ్లకుండా నిర్మాణాలను చేపట్టడంతో భారీ వర్షాలు కురిసినప్పుడు రహదారి పై వర్షపు నీరు నిలిచి రోడ్డు పై వెళ్లే వాహనదారులతో పాటు స్థానికులుకు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు.వర్షపు నీరు నిల్వకుండా మందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

## జనవిజ్ఞాన వేదిక మండల కార్యదర్శిగా సంపత్ కుమార్

బద్వేల్ అర్బన్, జూలై 21, ప్రభాతవార్త



జనవిజ్ఞాన వేదిక బి. కోడూరు మండల కార్యదర్శిగా సంపత్ కుమార్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర కమిటీ సభ్యులు ఏడి దేవదత్తం పేర్కొన్నారు. జిల్లా నాయకులు ఇన్నయ్య అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికలో మండల అధ్యక్షులుగా గుడిమె ఇన్నయ్య, అధ్యక్షులుగా సత్యరాజు ఉపాధ్యక్షులుగా జయ సుబ్బారెడ్డి, కార్యదర్శులుగా నల్లపోతుల కొండయ్య తదితరులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జనవిజ్ఞాన వేదిక ఆశయాలకు కట్టుబడి ప్రజలలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి, కమిటీ నిర్మాణానికి కృషి చేస్తానని తెలియజేశారు. అనంతరం దేవదత్తం మాట్లాడుతూ తెలుగు ప్రజల భావ విప్లవ వైతాళికుడు కందుకూరి "ప్రస్తుతం పాత కొత్తల మధ్య, సత్య సత్యముల మధ్య పోరాటం జరుగుతున్నద నీ ఈ పోరాటంలో ఎవరు తటస్థంగా ఉండకూడదు. బుద్ధి జీవులైన వారు ఏ పక్షముహించవలెను, అంతిమ విజయం ఎవరికో చెప్పనక్కర్లేదు. ఈ సంగ్రామం సుదీర్ఘంగా సాగవచ్చు, తీవ్రంగా ఉండవచ్చు అయితే జ్ఞానం అజ్ఞానాన్ని, సత్యం అసత్యాన్ని తప్పక జయిస్తాయి అని పిలుపునిచ్చారు. ఆ స్ఫూర్తితో పని చేస్తున్న జనవిజ్ఞాన వేదికలో సభ్యులై ప్రజాసైన్స్ ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు.

# పిఆర్సి, ఐఆర్ అమలు చేసి న్యాయం చేయాలి

బద్వేలు అర్బన్, జూలై 21, ప్రభాతవార్త

ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు అందజేయాల్సిన 30 ఐఆర్ వెంటనే ప్రకటించడంతో పాటు 12వ పిఆర్సి అమలు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలో బిటిఏ డివిజనల్ స్థాయి కార్యవర్గ సమావేశం కడప జిల్లా అధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి రామచంద్ర బాబు అధ్యక్షతన, డాక్టర్ హరి కొండయ్య ఆధ్వర్యంలో సరస్వతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో జరిగింది. ఈ ప్రాంతీయ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధనకార్యదర్శి రమేష్ మాట్లాడుతూ పి ఆర్ సి ప్రకటించడంలో కూటమి ప్రభుత్వం ఇప్పటి కే చాలా జాప్యం చేసిందని, వెంటనే కమిటీ నియమించి 12 వ ఆర్ సి ను అమలు జరపాలని, అప్పటి లోపల ప్రస్తుతం వెంటనే ఐ ఆర్ 30 ప్రకటించి ఉద్యోగ ఉపాధ్యాయ లకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఉద్యోగులకు న్యాయం చేస్తుంది అని ఒక సంవత్సరం పాటు ఓపిగ్గా ఎదురు చూసారు. కానీ ఉద్యోగ ఉపాధ్యాయ ఆర్థిక సమస్యల గురించి గాని, వారి సంక్షేమ మీద గాని ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయక పోవడం వలన ప్రభుత్వం మీద అసంతృప్తితో ఉన్నారన్నారు . ప్రభుత్వం ఈ అంశంపై ప్రకటన చేయాలని లేకపోతే ఉద్యమ బాట తప్పదన్నారు సమావేశానంతరం గోపవరం, బద్వేలు, బి కోడూరు మండలాలకు కన్వీనర్,కో కన్వీనర్ లను ఎన్నుకోవడం జరిగింది. బద్వేలు నియోజకవర్గ కన్వీనర్‌గా హెచ్.యం టి.శ్రీనివాసులు, బద్వేల్ మండల కన్వీనర్ సగిలి బాలయ్య, గోపవరం మండల కన్వీనర్ దాసరి పెంచలయ్య, కో కన్వీనర్ కోటపాటి ఓబులేష్ , బి కోడూరు మండల కన్వీనర్ అరవ నరసింహులు ను ఎన్నుకున్నారు.




# 27న కమిటి ఆధ్వర్యంలో సమావేశం



ప్రొద్దుటూరు, జులై 21, ప్రభాతవార్త

ఆగస్టు 27 నా వినాయక చవితి సందర్భంగా వినాయక ఉత్సవాల నిర్వహణపై ఈ నెల 27 ఆదివారం శ్రీ గణేష్ ఉత్సవ నగర కేంద్ర కమిటి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ కృష్ణ గీతాశ్రమంలో నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు శ్రీ గణేష్ ఉత్సవ నగర కేంద్ర కమిటి అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలో గత 45 సంవత్సరాలుగా శ్రీ గణేష్ ఉత్సవాలను, ఉత్సవాల అనంతరం ఊరేగింపులతో అత్యంత వైభవోపేతంగా గణేశ్ నిమజ్జన కార్యక్రమం జరుగుతుందని, కాగా 25 సంవత్సరాల క్రితం వరకు ఈ కార్యక్రమము ప్రొద్దుటూరు నగర ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో నిర్వహింపబడేదని, కాని హిందువుల సమైక్యతను, చైతన్యాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలోని అనేక గణేశ ఉత్సవ కమిటీల అభ్యర్ధన మేరకు నగరంలోని గణేశ్ ఉత్సవ కమిటీలను కలుపుకొని విశ్వహిందూ పరిషత్ మరియు భజరంగదళ్ అశీస్సులతో ఒక నగర ఉత్సవ కేంద్ర కమిటిని ఏర్పాటు చేసుకొని ఈ సంవత్సరం ఆగస్టు 27న వినాయక చవితి పండుగ సందర్భంగా అన్ని గణేశ్ కమిటిలు కేంద్రకమిటి అధ్వర్యంలో గణేశ్ ఉత్సవాలను మరియు సామూహిక నిమజ్జన శోభాయాత్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రమేష్, నగర అధ్యక్షుడు నాగమునిరెడ్డి, శ్రీ గణేష్ ఉత్సవ నగర కేంద్ర కమిటి సభ్యులు రెడ్డి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న కాలనీ లో వసతులు కల్పించాలని ధర్నా

ఎడ్యుకేషన్ జూలై 21 ప్రభాతవార్త :



కడప కొప్పర్తి గ్రామం వద్ద ఉన్న జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టరేట్ వద్ద రెవల్యూషనరీ మార్క్సిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్ఎంపిఐ) ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు అనంతరం జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్‌కి వినతి పత్రం సమర్పించారు. ఆర్ఎంపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల రమణయ్య మాట్లాడుతూ కొప్పర్తి జగనన్న కాలనీలలో మౌలిక వసతులే న వీధిలైట్లు తాగునీరు రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి వారికి రవాణా సౌకర్యం మరియు మెయిన్ రోడ్డు నుండి జగనన్న కాలనీ వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపిఐ జిల్లా కార్యదర్శి కొడవటికంటి నాగరాజు, అప్ప జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి భాస్కర్ మరియు కడప నగర నాయకులు శ్రీనివాసులు,రమేష్, సుబ్బరాయుడు , మల్లారెడ్డి, రవి, లక్ష్మీదేవి, నాగ మునెమ్మ, రమాదేవి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

# పి4 అర్హత ప్రమాణాలపై గ్రామసభ



సిద్ధవటం జులై 21 ప్రభాతవార్త

మండల కేంద్రమైన సిద్దవటం గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచ్ భవనాసి నాగరాణి అధ్యక్షతన పి4 అర్హత ప్రమానాలపై సోమవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బంగారు కుటుంబంపై అవగాహన కల్పించేందుకు గ్రామసభ ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్థాయి సర్వే, పి4 సర్వే ఆధారంగా అర్హతలు, అనర్హతలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వబడుతుందన్నారు. గ్రామంలో సీసీ రోడ్లపై ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిర్మాణ పనులు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. బంగారు కుటుంబ పథకంపై అర్హులున్నవారు సచివాలయంలో సంప్రదించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దాసరి రత్నకుమార్, వీఆర్ఓ కేశవులు, సర్పంచ్ ప్రతినిధి ఓబులయ్య, ఉప సర్పంచ్ హిదాయతుల్లా, మహబూబ్ బాషా కొట్టె రాజేష్ శ్రీరామ్ వినోద్ ఆవుల రాజా పసుపులేటి కళ్యాణ్ మాకం లక్ష్మీదేవి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్వాడి సిబ్బంది జనసేన పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వెల్లాల, కల్లూరు ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు

ప్రొద్దుటూరు, జులై 21, ప్రభాతవార్త

నియోజకవర్గంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెల్లాల ఆలయం, కల్లూరు గ్రామంలోని కుమ్మరి వీధిలోని రామాలయం అభివృద్ధికి ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అయ్యాయని ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రొద్దుటూరు దేవాలయాల నిర్మాణాలకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి ప్రభుత్వం నుండి సిజిఎఫ్ నిధులు విడుదల చేశారని వివరించారు. నియోజకవర్గంలోని రాజుపాలెం మండలం వెల్లాల గ్రామం శ్రీ చెన్నకేశవ, సంజీవరాయ, భీమ లింగేశ్వర స్వామి దేవస్థానాలకు 3,20,00,000, ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామం కుమ్మరి వీధి శ్రీరామాలయం దేవస్థానానికి 24,00,000 విడుదల చేశారని ఈ సందర్భంగా తెలియజేశారు. కాగా ఆయా గ్రామాల ప్రజలు ఈ విషయమై హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

# కళ్లకు ఇన్ఫెక్షన్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు అర్బన్, జూలై 21 ప్రభాతవార్త



జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కల్లూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ కే జె రఘు రామిరెడ్డి 333 మందికి కంటి పరీక్షలు చేయగా 5 మందికి దృష్టిదోషం ఉందని ఒక ప్రకటనలో తెలిపారు. వీరి అందరికి ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా ఉచితముగా ప్రభుత్వం ద్వారా కంటి అద్దాలు ఇస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 3శాతం,పట్టణ ప్రాంతాల్లో 8 నుండి 10 శాతం స్కూల్ పిల్లలలో దృష్టి లోపం ఉంటుందని తెలుపుతూ మంచి పౌష్టికాహారం తీసుకుంటు ఎప్పటి కప్పుడు కంటి పరీక్షలు చేసుకుంటూ కళ్లను సంరక్షించుకోవాలని పిల్లలు అందరికి అవగాహన కల్పించారు. అలాగే ఈ నెల నుండి కళ్లకు ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది కావున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విద్యాధికారి డాక్టర్ సుమన్, స్కూల్ హెడ్ మాస్టర్, వేళంగి రవికుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి రాజశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు శోభారాణి, ఇందిరమ్మ, ఆశారాణి పాల్గొన్నారు.

# పంచాయితీ కార్యదర్శుల సమావేశం

నిమ్మనపల్లె, జులై 21 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండలంలోని పంచాయితీ కార్యదర్శులు, వేల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రతినెల 1వ తేదీన పెన్షన్లు విధిగా పంపిణీ చేయాలని, పి4 జీరో పవర్‌టిపై సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, కార్యదర్శులు, వేల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# యాప్‌ల భారం తగ్గించాలంటు అంగన్వాడీల నిరసన

పెనగలూరు జూలై 21 ప్రభాతవార్త



ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు యాప్‌ల భారం తగ్గించాలంటూ సోమవారం నిరసన తెలుపుతూ చిట్వేలిప్రాజెక్టు సిడిపిఓ నిర్మల జ్యోతికి వినతి పత్రం ఇచ్చినట్లు అంగన్వాడి మండల అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, కార్యకర్తలు అన్నపూర్ణమ్మ, అనిత, మహాలక్ష్మిలు తెలిపారు. సోమవారం మండలంలోని గర్భవతులు బాలింతలతో కలిసి చిట్వేలి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల్లో యాప్‌ల భారం తగ్గించాలని ఈ సందర్భంగా కోరారు. గర్భవతులు బాలింతలు నెలకు నాలుగు సార్లు కేంద్రాలను రావాలంటే విముఖత వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వారు వచ్చిన సమయంలో సిగ్నల్స్ పనిచేయకపోవడంతో గంటల తరబడి వేచి ఉండలేక తమను నిస్తూరంగా మాట్లాడుతున్నారని తెలిపారు. యాప్‌ల విధానం తొలగించి మాన్యువల్ విధానంలో తమకు విధులు అప్పజెప్పితే పని భారం సులభంగా ఉంటుందని కోరారు.

# కురవంక ఉపసర్పంచ్‌పై అవిశ్వాసం పెట్టండి

## సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓకు సభ్యులు వినతి



ఏఓకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మదనపల్లె, జులై 21 ప్రభాతవార్త :

మదనపల్లె రూరల్ మండలం కురవంక ఉపసర్పంచ్ బైగారి భారతిపై అవిశ్వాసం తీర్మాణం పెట్టాలని గ్రామ పంచాయితీ వార్డుసభ్యులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఏఓ నిర్మాలాదేవికి వినతిపత్రం అందజేశారు. పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కురవంక వార్డుసభ్యులు ఉపసర్పంచ్ అవిశ్వాస తీర్మాణానికి సంబంధించి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్లు జి.క్రిష్ణమూర్తి, అనిత, షాజహాన్, చందన, మున్నిబేగంలు మాట్లాడుతూ ఉపసర్పంచ్ నాలుగేళ్ళుగా నిర్లక్ష్యంగా ఉంటూ గ్రామ పంచాయితీ సమావేశాలకు హాజరు కావడం లేదన్నారు. పంచాయితీ అభివృద్దిలో పాల్గొనకుండా నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. సర్పంచ్ పసుపులేటి చలపతితో సహా 9మంది వార్డు మెంబర్లు అత్యవసర సమావేశంలో నిర్ణయం తీసుకొన్నామన్నారు. నాలుగేళ్ళు పూర్తి అయిన సందర్భంగా పంచాయితీ చట్ట ప్రకారం అవిశ్వాస తీర్మాణం ఆమోదించి ఉపసర్పంచ్ పదవినుంచి బారతిని తొలగించాలని కోరారు. కొత్తగా ఉపసర్పంచ్‌ను ఎన్నుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. గత ఆరునెలలుగా అవిశ్వాస తీర్మాణం విషయంపై డిపిఓ, ఎంపిడిఓ, ఈఓఆర్‌డి, పంచాయితీ సెక్రటరీకి విన్నవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు చందన, గుల్జార్, శ్రీనివాసులు, డి.నాగరాజు, చంద్రకళ పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకో

## తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు, జనసేన నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె, జులై 21 ప్రభాతవార్త :

లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్ రాందాస్‌చౌదరిలు హెచ్చరించారు. సోమవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రులు లోకేష్, రామ్‌ప్రసాద్‌రెడ్డిలపై రమేష్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు పట్ల తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. రోజుకొక్క పార్టీ మారే రమేష్‌రెడ్డికి రాజకీయ విలువలు ఎక్కడ ఉన్నాయని తెలిపారు. అవకాశవాదిగా ఉండే రమేష్‌రెడ్డి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. మరోసారి కూటమి ప్రభుత్వంపైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్మెన్ జంగాల శివరామ్, టిడిపి నాయకులు సీడ్ మల్లికార్జుననాయుడు, దొరస్వామినాయుడు, ఆర్టీసి డిపో గౌరవ అధ్యక్షులు నాగూర్‌వల్లి, సురేంద్ర, తాళ్ళగిరి, గజ్జెల రెడ్డప్ప, గ్రానైట్‌బాబు, జనార్ధన్, రాజారెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# ఆధారాలతోనే ఎంపి మిథున్‌రెడ్డి అరెస్టు

## టిడిపి పార్లమెంటరీ నేత ఆర్‌జె.వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె, జులై 21 ప్రభాతవార్త :

సాక్షాదారాలతోనే ఎంపి మిథున్‌రెడ్డిని సిట్ పోలీస్‌బృందం అరెస్టు చేయడం జరిగిందని రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ తెలిపారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ లిక్కర్ స్కామ్ దేశంలోనే బోఫోర్స్ స్కామ్ కంటే పెద్దది అన్నారు. ఈ స్కామ్‌లో పూర్తిస్థాయి ఆధారాలతో సిట్‌బృందం విచారణ జరిపి అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఏపిలో ఒక్కచాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైకాపా రూ.3500కోట్లు మద్యం పాలసీలో అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. ఇంకా లిక్కర్ స్కామ్‌లో ఉన్న వైకాపా నాయకులను త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. మద్యం స్కామ్ కేసులో ఎక్కడా కక్షపూరిత రాజకీయాలు లేవని ఆయన తెలిపారు. గతంలో వైకాపా నాయకులు చేసిన పాపాలే వారి మెడకు చుట్టుకొంటున్నాయన్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ఇసు, మద్యం, మైండ్స్ లాంటివాటిలో భారీగా అక్రమాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, రాటకొండ మధుబాబు, గణేష్, గోపాల్, శివరామక్రిష్ణ, విద్యాసాగర్‌లో పాల్గొన్నారు.

# ఆటోను ఢీ కొన్న స్కూల్‌బస్సు

కురబలకోట, జులై 21 ప్రభాతవార్త :



స్కూల్‌బస్సు ఆటోను ఢీ కొన్న దృశ్యం

కురబలకోట మండలం ముదివేడు సమీపంలో సోమవారం సాయంత్రం స్కూల్ బస్ ఆటోను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ముదివేడు మోడల్ స్కూల్ విద్యార్థులు పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సిఐ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలావున్నాయి. విశ్వంస్కూల్ బస్సు ముదివేడు క్రాస్ వద్ద వెలుతూ మోడల్‌స్కూల్ పిల్లల ఆటోను ఢీ కొంది. ఈ ప్రమాదంలో గాయపడిన శివమణి, పల్లవి, లహరి, కేశవ, యశ్వంత్, మంజులను కురబలకోట 108 మస్తాన్, బావాజాన్‌లు మదనపల్లెలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# భూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



ఓబులవారిపల్లి జూలై 21 ప్రభాతవార్త

మండల పరిధిలోని చిన్నవరంపాడు పంచాయతీ జడ్‌హెచ్‌డిసి భూములకు సంబంధించిన రైతులు సోమవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ యామిని రెడ్డికి వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జడ్.హెచ్‌డీసీ భూములు 8 మంది రైతులకు సంబంధించిన భూములు గల్లంతయినాయని అదే విధంగా ఆక్రమణకు గురయ్యాయిని. రైతులు తాసిల్దార్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా రైతుల నిర్దేశించి తాసిల్దారు యామిని రెడ్డి మాట్లాడుతూ పూర్తి వివరాలు భూ రికార్డులు పరిశీలించి రాజంపేట సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంబంధించిన రైతులకు భూములందే విధంగా చొరవ చూపుతామన్నారు కొంతమంది జెడ్ హెచ్ డి సి ప్రభుత్వ భూములను 20 నుంచి 30 ఎకరాలు వరకు బినామీ పేర్లతో భూములు ఆక్రమించి అనుభవిస్తున్నట్లు. మరి కొంతమందికి భూములు అగ్రవర్ణాల వరకు క్రయవిక్రయాలు.కూడా జరిపినట్లు తమ దృష్టికి వచ్చినట్లు వాటిని కూడా పరిశీలించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

# అంగన్వాడి కేంద్రాల్లో ఫేస్ యాప్ రద్దు చేయాలి



ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

రాజంపేట, జూలై 21 ప్రభాతవార్త

అంగన్వాడి కేంద్రాల్లో విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఇచ్చే సరుకుల కోసం అమలు చేస్తున్న ఫేస్ యాప్ ఆచరణలో అమలు చేయాలంటే కష్ట సాధ్యంగా ఉందని ,అందువల్ల పేస్ యాప్ ను వెంటనే రద్దు చేయాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. ఒక్క యాప్ మాత్రమే అంగన్వాడిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం సోమవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ముందు అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. అంగన్వాడీల ద్వారా అందించే టేక్ హోమ్ రేషన్, ఇతర సేవల కోసం ఎఫ్ ఆర్ ఎస్ ధ్రువీకరణ అమలు తప్పనిసరి నిబంధన నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి రిపోర్టింగ్ విధానం అమలు చేయకముందే కేంద్రాలన్నిటిని వైఫై, ఇంటర్నెట్ తో అనుసంధానించేలా సాంకేతిక పరిజ్ఞానం సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. ఇవన్నీ లేకుండానే 2022లో అందించిన ఫోన్లతో ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అందుకు అవసరమైన డేటాను కూడా పొందేందుకు సొమ్ము కేటాయించాలని డిమాండ్ చేశారు.

# జీతాల పెంపు తాత్కాలిక ఉపశమనమే




ప్రొద్దుటూరు, జులై 21, ప్రభాతవార్త

రాష్ట్రంలో మున్సిపల్ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను జీవో నెంబర్ 124 ద్వారా మూడు వేల రూపాయలు పెంపు కార్మికులకు తాత్కాలిక ఉపశమనమే అని ఏఐటియుసి అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 124 ను ఏఐటియుసి అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అభ్యంతరం వ్యక్తం చేస్తోందన్నారు. రాష్ట్రంలోని మునిసిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం 21000 24,500 వేతనాలు గ్రేడ్ల వారీగా చెల్లించాల్సి ఉండగా అందుకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం 18500, 21500, 24,500 రూపాయల వేతనాలుగా కోతకోసి 3000 రూపాయలు మాత్రమే పెంచడం సమంజసం కాదన్నారు. దీనిపై రాష్ట్రంలోని అవుట్సోర్సింగ్ కార్మికులంతా ప్రస్తుత ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచేంతవరకు ఆగస్టు రెండు నుండి ఉద్యమం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి చైతన్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి మధు, ఉపాధ్యక్షులు రాజేష్, మున్సిపల్ నేతలు లక్ష్మీదేవి,అరుణ్, ప్రభాకర్ లు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజం అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పీలేరు జూలై 21 ప్రభాతవార్త :

ప్రజారోగ్య పరిరక్షణకోసం ప్లాస్టిక్ వాడకం ఆపడములో విద్యార్థుల భాగస్వామ్యం కీలకమని పిహెచ్ సి తలుపుల ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శ్రీ గిరీష విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం మేల్లచేరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు "ప్లాస్టిక్ వినియోగం ప్రజారోగ్యా అనర్థాలు" అంశముపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగంవల్ల నేల, నీరు, గాలి,భూమిని కలుషితం చేయడమేకాకుండా పర్యావరణాన్ని మరియు మనిషి ఆరోగ్యాన్ని కూడా హానికల్గిస్తాయని శ్రీ గిరీష అన్నారు. పేపరు,గుడ్డ,లేదా ఇతర పర్యావరణ అనుకూల పదార్థాలతో చేసిన ఉత్పత్తుల సంచులను ఉపయోగించాలని, ఇది అందరి బాధ్యత అని డిప్యూటీ హెచ్ఇఓ కొండయ్య అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఓ కొండయ్య,హెడ్మాస్టర్ సురేంద్ర పర్యవేక్షకులు కృష్ణయ్య, సిహెచ్ఓ లు కుముద,లావణ్య ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పురుషోత్తం

పీలేరు జూలై 21 ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడం జరిగింది . అందులో భాగంగా భారతీయ జనతా పార్టీ నాయకుడు నిమ్మనపల్లి పురుషోత్తమును జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది . ఈ సందర్భంగా నిమ్మనపల్లి పురుషోత్తం మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కార్యకర్తల కష్టాన్ని గుర్తించి పని చేసే ప్రతి కార్యకర్తకు తగిన స్థాయిలో గుర్తింపును జరుగుతుందని అందుకు తానే నిదర్శనమని నా సహకరించినటువంటి జిల్లా ప్రధాన కార్యదర్శి నరేంద్ర కుమార్ రెడ్డికి మరియు భారతీయ జనతా పార్టీ నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ పీలేరు నియోజకవర్గం లో భారతీయ జనతా పార్టీ ఎదుగుదలకు పార్టీని ముందుకు తీసుకువెళ్లడానికి అహర్నిశం శ్రమించి పార్టీ కోసం పనిచేస్తానని గతంలో తాను భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శిగా బీజేవైఎం జిల్లా అధ్యక్షునిగా బీజేవైఎం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా విద్యార్థి దశలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అనేక పర్యాయాలు పనిచేయడం జరిగిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర జిల్లా నాయకత్వం తాను చేసినటువంటి పనిని గుర్తించి తనకు రాజంపేట పార్లమెంట్ అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడం జరిగిందని తెలియజేశారు.

## రాజంపేట అయ్యప్ప ఆలయంలో
# వైభవంగా అష్టాదశ కలశాభిషేకం

రాజంపేట, జూలై 21 ప్రభాతవార్త



అయ్యప్ప మూలవిరాట్



సాయిబాబా పున:ప్రతిష్ట

రాజంపేట జాతీయ రహదారిలోని మణికంఠనగర్‌లో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం అయ్యప్ప స్వామి అష్టాదశ కళసాభిషక పూజలు నిర్వహించారు. 40 రోజులుగా తిరుగుతున్న అయ్యప్ప మండల పూజలు పూర్తయ్యాయి. అలాగే షిరిడి సాయి బాబా పున ప్రతిష్ట పూజలు కూడా మండలం పాటు కొనసాగాయి. ఈ నేపథ్యంలో మండల పూజలు పూర్తయిన సందర్భంగా అయ్యప్పకు, షిరిడి సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప ఆలయంలో అష్టాదశ అభిషేక పూజలు ఘనంగా జరిగాయి. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, సాయిబాబా పున ప్రతిష్ట పూజలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక హోమ పూజలు కూడా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పాల ప్రకాష్, ఆలయ గురుస్వామి కొండా సత్యనారాయణ, ధర్మకర్తలు దాము ఆచారి, వెంకటేశ్వర్ రెడ్డి , రమేష్ బాబు, సుధాకర్, గురు స్వాములు పులి కృష్ణ, వెంకటసుబ్బయ్య ఆచారి, ఆలయ అర్చకులు రాఘవేంద్ర శర్మ, భక్తులు పాల్గొన్నారు.

## ఉజ్జయిని మహంకాళమ్మకు ఆషాడం సారే సమర్పణ



పెనగాలూరు జులై 21ప్రభాత వార్త

మండలంలోని బెస్త పల్లి గ్రామంలో వెలసినటువంటి ఉజ్జయిని మహంకాళి అమ్మకు ఆదివారం రాత్రి సమరత సేవ ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో బెస్త పల్లి గ్రామ ప్రజలు ఆషాడం మాస సారే సంబర్పణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామంలోని అనంతపురం గంగమ్మ దేవాలయం నుండి మంగళ వాయిద్యాల స్వాగతంతో మహిళలు మహంకాళమ్మకు పసుపు కుంకుమ, చీర జాకెట్, గాజులు, పసుపుకొమ్ములు, తాళిబొట్టు దారము, ఒడిబియ్యము, పూలు పండ్లుతో పాటు మంగళకరమైన వస్తువులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమరత సేవ ఫౌండేషన్ జిల్లా పరియోజన సహ ప్రముఖు జయరాం రెడ్డి, బాలవికాస ఉపాధ్యాయ జిల్లా సహకన్వీనర్ వెంకటరమణయ్య రాజంపేట సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ పాఠశాలల సమస్యలపై వినతి

### రూటా రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్‌ఖాన్



మంత్రి, ఎమ్మెల్యేలను కలసిన మహమ్మద్‌ఖాన్

మదనపల్లె, జులై 21 ప్రభాతవార్త :

ఉర్దూ పాఠశ్రాలల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎస్ఎండి ఫారూక్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాలకు రూటా రాష్ట్ర ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్‌ఖాన్ విన్నవించారు. సోమవారం మద్యాహ్నం స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నివాసానికి విచ్చేసిన మంత్రిని రూటా నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఎస్‌సిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి కేటగిరిలకు రిజర్వ్ చేసిన ఉర్దూ టీచర్ పోస్టులను డీ రిజర్వ్ చేయాలని కోరారు. డిఎస్‌సిద్వారా పోస్టులు భర్తీ అయ్యే వరకు విద్యాబోధన కుంటుపడకుండా ఉర్దూ పాఠశాలల్లో విద్యావాలంటీర్లను నియమించాలన్నారు. అలాగే చంద్రన్న నవీన మదరసా కార్యక్రమంలో భాగంగా మదరసాల్లో ఆధునిక విద్యాబోధనకు టీచర్లను నియమించాలని కోరారు. ఈకార్యక్రమంలో పలువురు ఉర్దూ ఉపాధ్యాయులు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మనస్సు ప్రశాంతంగా ఉంటే జీవితం ఆనందమయం

రాజంపేట, జూలై 21 ప్రభాతవా ర్త




మనసు ప్రశాంతంగా ఉంటే జీవితం ఆనందమయమని హైదరాబాద్ రామకృష్ణ మఠం ప్రధాన ఉపన్యాసకులు బోధమయానందాజీ మహారాజ్ అన్నారు. మనస్సు నిబద్ధతతో నడిపితే జీవిత విజయం సాధించినట్లే అన్నారు. సోమవారం అన్నమాచార్య యూనివర్సిటీలో ఖిమైండ్ మేనేజ్‌మెంట్ ఫర్ బెట్టర్ ఫ్యూచర్‌ఖిపై ప్రత్యేకసదస్సును అన్నమాచార్య రేడియో 89.6, హైదరాబాద్ రామకృష్ణ మఠం సంయుక్తంగా నిర్వహించాయి. ఫైనల్ ఇయర్ బీటెక్ విద్యార్థుల కోసం నిర్వహించిన సదస్సులో స్వామీజీ మాట్లాడుతూ జ్ఞానం, నియంత్రణ, ధ్యానం జీవితాన్ని గెలవడానికి మార్గం చూపుతాయన్నారు. విద్యార్థులు జీవిత పరిపక్వతకు, లక్ష్య సాధనకు మైండ్ మేనేజ్‌మెంట్ ఎంత అవసరమో వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డా. సాయి బాబా రెడ్డి మాట్లాడుతూ నైతిక విలువలు, ఆధ్యాత్మికతతో కూడిన వ్యక్తిత్వ వికాస సదస్సులు విద్యార్థుల జీవితాల్లో కీలకంగా మారతాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.ఎం.వి. నారాయణ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి అద్భుతమైన భవిష్యత్తును కలిగి ఉండాలంటే ముందు మనస్సును క్రమబద్ధీకరించుకోవాలన్నారు. మనసును ఎవరైతే ప్రశాంతంగా నిలుపుకుంటారో వారు జీవితంలో విజేతలవుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలుమ్ని కోఆర్డినేటర్, అన్నమాచార్య రేడియో 89.6 స్టేషన్ డైరెక్టర్ డా. కాశిగారి ప్రసాద్ ,విద్యార్థులు పాల్గొన్నారు.

## జోరందుకున్న అమ్మవారిశాల అధ్యక్ష ఎన్నికల ప్రచారం

బద్వేలు అర్బన్,జూలై 21 ప్రభాతవార్త :

బద్వేలు ఆర్యవైశ్య అధ్యక్ష ఎన్నికల ప్రచారం జోరందుకుంది. సోమవారం నామినేషన్ దాఖలు చేసిన కేవి.సుబ్బారావు పలువురి ఆర్యవైశ్యులతో కలసి పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ప్రచారంలో అడుగడుగా పలువురు వైశ్యులు సాదరంగా ఆహ్వానం పలికి శాలువా, పూలమాలలతో సత్కరించి నిరాజనాలు పలుకుతున్నారు. ఈ సందర్భంగా కేవి.సుబ్బారావు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో పలువురు ఆర్యవైశ్యుల సహకారంతో గత 6 సంవత్సరాలుగా అమ్మవారిశాల అభివృద్ధి చేశామని మరో అవకాశం కల్పిస్తే అందరి సహాయ సహకారాలు అందించి మరోసారి గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జొన్నలగడ్డ సుధాకర్ కుటుంబ సభ్యులు కేవి.సుబ్బారావు స్వగృహంలో పలువురికి ఆహ్వానం పలికి శాలువాతో సత్కరించి అందరికీ ప్రత్యేక అల్పాహార స్నాక్స్‌నుఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపెంట సురేష్‌బాబు, పత్తి నాగేంద్రప్రసాద్, శ్రీదర్ , శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## డెంగీ నియంత్రణలో విద్యార్థుల పాత్ర కీలకం



అవగాహన ర్యాలీ

పీలేరు జూలై 21 ప్రభాతవార్త :

డెంగీ జ్వరాల నియంత్రణ లో విద్యార్థుల పాత్ర కీలకం అని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మరియు సబ్ యూనిట్ అధికారి కళీలు ళ్ళాఖాన్‌లు అన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు మదనపల్లి అర్బన్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన దొంతి వీధి, త్యాగరాజా వీధిలోని కాలనీ గేట్ సొసైటీ కాలనీలోని నెహ్రూ మునిసిపల్ పాఠశాల మరియు దకిని పేటలోని ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డెంగీ మాసోత్సవాలు సందర్భంగా డెంగీ జ్వరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మాట్లాడుచు ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించడం, రోజూ సాయంత్రం వేళ ఇళ్లలో పచ్చి వేపాకు పొగ వేయడం, సాయంత్రం వేళ ఇళ్ల లో లైట్స్ వేసినపుడు తలుపులు, కిటికీలు ఒక అర గంట మూసివేయడం, దోమతెరలు వాడటం, కిటికీలకు మెష్ కొట్టించుకోవడం, ఇంటి చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, కాలువలలో చెత్త వేయకుండా చూసుకోవడం వంటి ఖర్చు లేనటువంటి జాగ్రత్తలు పాటించడం వల్ల దోమల పెరుగుదలను నియంత్రణ చేసి తద్వారా జ్వరాల వ్యాప్తిని కట్టడి చేయవచ్చాన్నారు. ఇందుకోసం విద్యార్థుల భాగస్వామ్యం తప్పనిసరిగా అవసరం అన్నారు. జ్వరాలు వచ్చిన యెడల ప్రజలు ఆర్. ఎమ్. పి లు, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా దగ్గరలోని హెల్త్ వెలనెస్ సెంటర్ లేదా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేదా జిల్లా అస్పత్రికి వెళ్లాలని అన్నారు. విద్యార్థులు సాయంత్రం ఇంటికి వెళ్లి ఇక్కడ డెంగీ పై విన్న సమాచారం వారి తల్లితండ్రులకు చెప్పి దోమలు ద్వారా వ్యాప్తి చెందు వ్యాధులపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులు నుండి ఫీడ్ బ్యాక్ తీసుకొని అభినందించారు. సబ్ యూనిట్ అధికారి కళీలుళ్ళకాన్ మాట్లాడుచు డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు మరియు టైఫాయిడ్ జ్వరాలకు సంబంధించిన రక్త పరీక్షలు అన్ని ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా చేస్తారణి, వ్యాధి నిర్ధారణ ఐతే ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటుగా వారి ఏరియాలలో దోమల పెరుగుదల నివారణ, నియంత్రణ చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమం లో హెచ్. ఎమ్ లు షాజహాన్, శీనప్ప, ఉపాధ్యాయ బృందం , ఏ. ఎన్. ఎమ్ లీలావతి ఆశాకార్యకర్తలు దీప, ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

## నామినేషన్ దాఖలు చేసిన కేవి.సుబ్బారావు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కేవి.సుబ్బారావు

బద్వేలు అర్బన్,జూలై 21 ప్రభాతవార్త :

బద్వేలు వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాల అధ్యక్షులుగా సోమవారం బాలాజీ గ్రూపు ఎండీ కేవి.సుబ్బారావు అట్టహాసంగా పలువురితో కలిసి స్థానిక అమ్మవారి సన్నిధిలో నామినేషన్ పత్రాలు అందించారు. గత 6 సంవత్సరాలు అమ్మవారి శాల అధ్యక్షులుగా కేవి.సుబ్బారావు గతలంలో ఎన్నడూ చేయని విధంగా అమ్మవారిశాల అభివద్ధి, శ్రీ కన్యకా పరమేశ్వరీ షాపింగ్ కాంప్లెక్స్, స్మశాన వాటికలకు అవసరమైన అనేక రకాల వసతులతో పాటు పలు రకాలుగా అభివృద్ధి చేశామని మరోసారి అవకాశమిస్తే అమ్మవారి సేవ చేసుకుంటూ మరింత అభివృద్ధి చేస్తానని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారులు, మాజీ కమిటి సభ్యులతో కలిసి ముందుగా మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, సత్యనారాయణ, దర్శి వెంకటేశ్వర్లు, నాగరాజ, పీఎన్ఆర్ ఫౌండేషన్ నాగరాజ, దర్శి సుబ్బరాజా, అవోపా సెక్రటరీ సివి. నాగేశ్వరరావు, వాసవిక్లబ్ అధ్యక్షులు సిద్దయ్య, వల్లంకొండు సూర్య తోపాటు మాజీ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గోపాల్ రెడ్డి సేవలు మరువలేనివి




బద్వేల్ అర్బన్ జూలై 21 ప్రభాత వార్త :

ప్రముఖ విద్యావేత్త కీర్తిశేషులు సానపు రెడ్డి గోపాల్ రెడ్డి తృతీయ వర్ధంతి కార్యక్రమం సోమవారం బద్వేలు పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు, ముందుగా సానపురెడ్డి గోపాల్ రెడ్డి చిత్రపటానికి వారి కుమారుడు సానపు రెడ్డి రామగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ సంగం అధ్యక్షులు ఎద్దుల రామసుబ్బారెడ్డి, సెక్రటరీ కత్తి బ్రహ్మయ్య తోపాటు పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు, అనంతరం వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఐదు నిమిషాల పాటు పలువురు మోనం పాటించారు, ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు ఎద్దుల రామసుబ్బారెడ్డి, ఎన్జీవోస్ సంగం అధ్యక్షులు నరసింహారెడ్డి, తో పాటు పలువురు మాట్లాడుతూ సానపు రెడ్డి గోపాల్ రెడ్డి ఉపాధ్యాయ వృత్తిలో బద్వేల్ పట్టణ పరిసర ప్రాంతాలలో 30 సంవత్సరాలు పైగా విధులు నిర్వహించి వారి విధి నిర్వహణలో ఎక్కడ ఎటువంటి చిన్న మచ్చ లేకుండా అందరి మన్ననలు పొందారున్నారు, వారి వద్ద చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు అనేక రంగాలలో స్థిరపడి ఉన్నత స్థాయికి చేరుకోవడం జరిగిందన్నారు, ఉపాధ్యాయ వృత్తిలోనే కాకుండా ఎవరికైనా ప్రమాద వశాత్తు కాళ్ల చేతులు విరిగిన వారికి మెరుగైన వైద్యం కోసం పిండి కట్టు కట్టి వారిని సాధారణ స్థితికి తీసుకువచ్చే విధంగా ఎంతోమందికి వారు సేవలు అందించారన్నారు, మంచితనానికి మారుపేరుగా ఎటువంటి కల్మషం ఎరుగని హృదయాలతో చెరగని ముద్ర వేసుకున్న గోపాల్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని పలువురు ఆకాంక్షించారు, వారి వర్ధంతి సందర్భంగా వారి కుమారులు సానపరెడ్డి రామగోపాల్ రెడ్డి, రాధాకృష్ణారెడ్డి లు అనేక సేవా కార్యక్రమాలను ప్రతి సంవత్సరం చేపట్టడం సంతోషకరమన్నారు, అనంతరం వారి స్వగ్రామమైన బోవిల్లవారిపల్లెలో సానపురెడ్డి గోపాల్ రెడ్డి చిత్రపటానికి పలువురు పూల మాల వేసి నివాళులర్పించారు, అనంతరం వారి సేవలను కొనియాడారు, ఈ కార్యక్రమంలో గంజికుంట పుల్లయ్య, గంగన్న, ముల్లపాటి పిచ్చయ్య, రాఘవరెడ్డి,ఆనందరావు, శ్రీరాములు, సుబ్బరాయుడు, శ్రీనివాసరెడ్డి, చిన్నరాయుడు గ్రేషియన్, లక్ష్మీనరసయ్య తో పాటు పలువురు పాల్గొన్నారు




## సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణ మహోత్సవం



కెవిపల్లి జూలై 21 ప్రభాతవార్త:

నియోజకవర్గంలోని వాల్మీకిపురం మండలంలో వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథం శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో అదివారం రాత్రి కన్నుల పండువగా శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణోత్సవం జరిగింది. ఆడికృత్తిక సందర్భంగా ఆలయంలోని కళ్యాణమండపంలో షిరిడి సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేద పండితులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, రాజుస్వామి, అభిరాంస్వామి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, ఉత్సవ మూర్తుల అలంకరణ చేశారు. వల్లి దేవసేన సుబ్రహ్మణ్యస్వామిలను పూలు, ఆభరణాలతో అలంకరించి కళ్యాణ వేదికపై ముస్తాబు చేసి కంకణ ధారణ, యజ్ఞోపవితం, భాసింగ ధారణ, బెల్లం జీలకర్ర సమర్పణ, ఎదుర్కోలు ఉత్సవం, మాంగల్య సూత్రాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామి జయంతి సందర్భంగా స్వామి జననానికి సంబంధించిన విషయాలను శ్రీనివాసాచార్యులు వివరించారు. హోమాధి కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రోచ్ఛరణలతో మంగళ వాయిద్యాలు నడుమ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణం నిర్వహించారు. అలాగే శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారికి ఆలయం వద్ద రథోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ, అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు మురళీ మోహన్, వసంతమ్మ, పద్మ, శశికళ, రాధమ్మ, కోమల, వెంకటేష్ బాబు, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి తోడ్పాటునందించండి

### భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్

వేంపల్లి: జూలై 21 (ప్రభాత వార్త):

వేంపల్లి లోని ఆలయాల అభివృద్ధి కి తోడ్పాటునందించాలని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరి ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం తిరుపతి లో టీటీడీ పాలక మండలి సభ్యులు భానుప్రకాష్ రెడ్డి ని కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేంపల్లి లో గత ఆరు సంవత్సరాలుగా ప్రారంభానికి నోచుకోని టీటీడీ కల్యాణ మండపాన్ని తెరిపించాలని కోరారు. అలాగే వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం లో నాయిబ్రాహ్మణులను నియమించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే గండి క్షేత్రానికి టీటీడీ నుండి రావాల్సిన బంగారు, వెండి తో పాటు లడ్డూ ప్రసాదం తయారు చేయుటకు పోర్టు నిర్మాణానికి కావాల్సిన నిధులను టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నుండి మంజూరు చేయించాలని కోరగా మంగళవారం జరిగే పాలకమండలి సమావేశం లో చర్చించి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు కె.రామచంద్ర రెడ్డి,వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు దొంతు సుమన్,బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబోయిన రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## లిక్కర్ స్కామ్‌లో
# జగన్ సూత్రధారి

### రాజంపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూల భాస్కర్

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

ఏపీ లిక్కర్ స్కామ్ విషయంలో కాంగ్రెస్ పార్టీ సీరియస్ గా ఉందని. మిథున్ రెడ్డి అరెస్టు తర్వాత కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిసిసి అధికార ప్రతినిధి, రాజంపేట నియోజకవర్గం ఇంచార్జీ పూల భాస్కర్ సోమవారం పేర్కొన్నారు. మిథున్ రెడ్డి కేవలం ఓ పావు మాత్రమే, రాజంపేట పార్లమెంటును జిల్లా కేంద్రం కాకుండా, అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడానికి వైసిపి ఇసుక దోపిడీ నే మూల కారణమన్నారు. అన్నమయ్య ప్రాజెక్టును పునర్మించాలి అయితే అన్నమయ్య ప్రాజెక్టు బాధితుల పక్షాన నిలబడినటువంటి దాఖలాలు లేవన్నారు. ఇటువంటి ఎంపీ రాజంపేట నియోజకవర్గానికి అవసరం లేదన్నారు . రాజంపేటను జిల్లా కేంద్రం రాకుండా ద్రోహం చేసినటువంటి వ్యక్తి మిధున్ రెడ్డి అని లిక్కర్ స్కామ్ లో అసలు సూత్రధారులు జగన్మోహన్ రెడ్డి అని ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డి మద్యం మాఫియా ఆంధ్రప్రదేశ్‌లో కోటి పేద కుటుంబాలను నాశనం చేసిందని మండిపడ్డారు.

ఈ సారి అవకాశం వచ్చింది కదా అని చేసింది కాదని.. ఓ ప్రత్యేకమైన ప్రణాళిక ప్రకారం చేసిన టాప్‌డౌన్ ఆపరేషన్. అన్నారు. లిక్కర్ తయారి, పంపిణి, లంచాలు సూట్ కేసు కంపెనీలు.. ఇలా దోపిడీని చట్టబద్ధం చేయడానికి చాలా ప్రయత్నాలు చేశారన్నారు. నకిలీ ఇన్‌వాయిస్‌లు, ప్పందాల ద్వారా కమీషన్లు ఇచ్చారు. డబ్బును లాండరింగ్ చేయడానికి హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నంలలో షెల్ కంపెనీలను ప్రారంభించారన్నారు. రవాణా, గిడ్డంగుల ఒప్పందాలను కూడా ప్రాక్సీ సంస్థలకు ఇచ్చారన్నారు. వీటిని లాజిస్టిక్స్ ఖర్చులుగా చూపించారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మండల అధ్యక్షుడు మహదేవయ్య, శివయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.





బద్వేల్ 5 వవార్డ్‌లో సుపరిపాలన తొలిడుగు డోర్ టు డోర్ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జెట్టిబోయిన సింగరయ్య తెలుగు రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు జాన్సీ సింగసాని రమణయ్య తెలుగు యువత నాయకులు గనుమంతు రాజేష్ కొంకుల రవి, ప్రశాంత్, చిన్నా, వెంకటసుబ్బయ్య, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## 3 సంవత్సరముల న్యాయవాద ప్రాక్టీసు తప్పనిసరి-సర్వీసు రూల్స్ సవరించాలని హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు

(జూనియర్ డివిజన్ సివిల్ జడ్జీల నియామకంపై సుప్రీం కోర్టు తీర్పు)

బద్వేలు లీగల్, జూలై 21 ప్రభాతవార్త :

వివిధ న్యాయ స్థానములలో జూనియర్ సివిల్ జడ్జీగా న్యాయ సేవలలోకి ప్రవేశించాలంటే కనీసం 3 సంవత్సరములు న్యాయవాదిగా ప్రాక్టీసు తప్పనిసరిగా చేసి వుండాలని సుప్రీం కోర్టు ధర్మాసనం సుస్పష్టం చేసింది. ఆ మేరకు సర్వీసు రూల్స్‌ను అన్ని హైకోర్టులు, రాష్ట్ర ప్రభుత్వాలు సవరించాలని ధర్మాసనం ఆదేశాలను కూడా జారీ చేసింది. ఆల్ ఇండియా జడ్జెస్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటీషన్‌ను చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్, జార్జ్ మసీహ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం విచారించి సివిల్ జడ్జిగా నియామక పరీక్షకు అర్హత సాధించాలంటే అభ్యర్థులు న్యాయవాదిగా కనీసం 3 సంవత్సరముల పాటు ప్రాక్టీసు చేసి ఉండాలని దిగువ స్థాయి న్యాయ స్థానాలలో న్యాయ సేవల సమర్థతకు అనుభవం అత్యవసరమని కూడా ధర్మాసనం అభిప్రాయపడుతూ న్యాయ కళాశాలల నుంచి తాజాగా బయటికి వచ్చిన న్యాయ పట్టభద్రులు సివిల్ జడ్జీగా న్యాయ సేవలోకి ప్రవేశించిన తరువాత సమస్యలను ఎదుర్కొంటున్నట్లుగా గుర్తించినట్లు ధర్మాసనం వెల్లడించింది. అందువలన న్యాయ సేవలో ప్రవేశించబోయే వారు ఒక నిర్దిష్ట కాలం న్యాయవాదిగా అనుభవం గడించాల్సిన అవసరం ఉందని హైకోర్టులు వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని తాము ఏకీభవిస్తున్నట్లు కూడా ధర్మాసనం పేర్కొంది. జిల్లా కోర్టులు, హైకోర్టు లేదా సుప్రీం కోర్టులలో ఎన్ని సంవత్సరములు ప్రాక్టీసు చేశారనేది వారి తాత్కాలిక నమోదు లేదా సంబంధిత రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న తేదీ నుండి లెక్కించబడుతుందని ధర్మాసనం తెలిపింది. దేశంలోని న్యాయమూర్తులు లేదా న్యాయాధికారుల వద్ద లా క్లర్క్‌లుగా పని చేస్తున్నపుడు అభ్యర్థులు పొందిన అనుభవాన్ని కూడా వారి మొత్తం ప్రాక్టీసు సంవత్సరముల సంఖ్యను లెక్కించేటపుడు పరిగణన లోనికి తీసుకోవాలని నిర్దేశిస్తున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. పరీక్ష ద్వారా ఎంపికైన జూనియర్ డివిజన్ సివిల్ జడ్జి పోస్టులో నియుక్తులైన అభ్యర్థి కోర్టులో జడ్జీగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు ఒక సంవత్సరం పాటు శిక్షణ తప్పనిసరిగా తీసుకోవాలని కూడా ధర్మాసనం ఆదేశించింది. అయితే ఇప్పటికే కొన్ని హైకోర్టులు సివిల్ జడ్జి పోస్టుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించిన సందర్భం ఉంటే కనీసం 3 సంవత్సరముల ప్రాక్టీస్ అనే నిబంధన వర్తించదని ధర్మాసనం స్పష్టం చేసింది. తాము తీర్పు వెలువరించిన తేదీ నుండి 3 నెలల వ్యవధిలోగా హైకోర్టు తమ ఆదేశాల మేరకు అన్ని సవరణలు అమలు చేయాల్సి ఉందని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు మరో 3 నెలల లోగా దానిని పరిశీలించి, ఆమోదించాలని కూడా ధర్మాసనం ఆదేశిస్తూ సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి కేడర్ నుండి ఉన్నత న్యాయ సేవకు పదోన్నతి కొరకు పరిమిత విభాగ పోటీ పరీక్షకు రిజర్వేషన్ కోటాను 25 శాతం పెంచడానికి సంబంధిత సర్వీసు నియమాలను సవరించాలని అన్ని హైకోర్టులు, రాష్ట్ర ప్రభుత్వాలను ధర్మాసనం ఆదేశించింది. సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి కేడర్ నుండి ఉన్నత జ్యుడిషియల్ సర్వీసుకు పదోన్నతి పొందేందుకు ఎల్‌డిసిఈలో హాజరుకావడానికి అవసరమైన కనీస అర్హత సేవను మూడేళ్ళకు తగ్గించాలని కూడా పేర్కొనింది. జూనియర్ డివిజన్ సివిల్ జడ్జి, సీనియర్ డివిజన్ సివిల్ జడ్జిగా అందించిన సేవతో సహా చేపట్టాల్సిన మొత్తం సేవను కనీసం 7 సంవత్సరములు సర్వీసుగా నిర్ణయించాలని కూడా ధర్మాసనం పేర్కొంటూ తే.20.5.2025 దీన ఈ తీర్పును వెలువరించింది. (ఆలిండియా జడ్జెస్ అసోసియేషన్ ఎదిరి యూనియన్ ఆఫ్ ఇండియా మినిమం ప్రాక్టీస్ అండ్ ఎల్‌డిసిఈ ఇష్యూ ఐఎ నెం.93974/2019 విత్ ఐఎ నెం.72900, 73015 అండ్ 40695/2021 విత్ ఐఎ నెం.50269 అండ్ 201893/2022 ఇన్ డబ్ల్యుపి (సి) నెం.1022/1989.)

వార్త

రిపోర్టర్స్ కావలెను

తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

కడప జిల్లా

పోరుమామిళ్ళ, జమ్మలమడుగు, చెన్నూరు, కొండాపురం, ఎర్రగుంట్ల రూరల్, గోపవరం, అట్లూరు, సికెదిన్నె, కడపక్రైమ్

అన్నమయ్య జిల్లా

వాయల్పాడు, రైల్వేకోడూరు, వీరబల్లి, రాయచోటి, నందలూరు, కలకడ

ఇంటర్వ్యూ తేది : 24.07.2025

మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.

సెల్ నెం. 9848787289, 8919566086